క్లుప్తంగా

గుంతలు పూడ్చిన స్థానికులు



క్రొవ్విడి అంబేడ్కర్ కూడలిలో పూడ్చిన గుంతలు

సాక్షి స్పందన

నిడమర్రు: క్రొవ్విడి ఆర్అండ్బీ రహదారి ప్రమాదకరంగా ఉందంటూ ఈ నెల 8వ తేదీన ప్రచురితమైన నరకానికి రహదారి అనే వార్తకు స్థానిక పెద్దలు, ఆక్వా రైతులు స్పందించారు. మాజీ వైస్ ఎంపీపీ నౌడు అచ్యుత రామారావు, గ్రామ పెద్ద వాకమూడి ఇంద్ర ఆధ్వర్యంలో ఆక్వా రైతుల సహకారంతో క్రొవ్విడి గ్రామంలో అధ్వానంగా ఉన్న గుంతలను బ్లాక్ స్టోన్, ఎర్రకంకర రాళ్లతో జేసీబీ సహకారంతో గుంతల పూడిక పనులు చేస్తున్నారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకూ జేసీబీ సహాయంతో పనులు చేస్తున్నారు. కురుస్తున్న వర్షాలతో ఇటీవల క్రొవ్విడి నుంచి ఉప్పరగుడెం వరకూ జరిగిన పలు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని గుంతలు పూడ్చినట్లు స్థానిక రైతులు తెలిపారు. ఈ కిలోమీటరు మేర గుంతలు పూడ్చుటకు రూ.1 లక్ష స్థానిక రైతుల సహకారంతో పూర్తి చేసినట్లు నౌడు అచ్యుత రామారావు తెలిపారు.

వ్యాయామ కళాశాలలో ఎన్ఎస్ఎస్ క్యాంపు

దెందులూరు: విద్యార్థులకు విద్య, క్రీడలతో పాటు సమాజ సేవ అవసరమని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నతానియేలు అన్నారు. ఆదివారం వ్యాయామ కళాశాలలో ఎన్ఎస్ఎస్ క్యాంప్ డైరెక్టర్ రత్నబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. డీపీఈడీ, బీపీఈడీ వ్యాయామ అధ్యాపక విద్యార్థులు కళాశాలలో తరగతి గదుల బయట గోడలకు సున్నం, రంగులు వేశారు. కళాశాలలో చెత్తాచెదారాన్ని, మొక్కలను తొలగించారు.

జేవీవోగా మహమ్మద్ బాజీ

దెందులూరు: పశువైద్య శాఖ పోతునూరు జూనియర్ వెటర్నరీ ఆఫీసర్గా కైకలూరు మండలం భుజబలపట్నం జూనియర్ వెటర్నరీ ఆఫీసర్గా పని చేస్తున్న మహమ్మద్ బాజీ నియమితులయ్యారు. ఇప్పటి వరకు పోతునూరు జూనియర్ వెటర్నర్ ఆఫీసర్గా పని చేసిన రాములయ్య దొర, నాగుల దేవునిపాడు జూనియర్ వెటర్నరీ ఆఫీసర్గా బదిలీ కావడంతో బాజీ పోతునూరు వచ్చారు. అందరి సహాయ సహకారాలతో పశువుల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ, వ్యాధుల నివారణకు తన వంతు కృషి చేస్తానని బాజీ అన్నారు.

కార్మిక హక్కులపై 'కూటమి' దాడి



సమావేశంలో మాట్లాడుతన్న నారపల్లి రమణ

నిడమర్రు: చంద్రబాబు సర్కారు కార్మికుల హక్కులపై దాడి చేస్తోందని. దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా పని గంటలను 8 నుంచి 10 గంటల వరకూ పెంచడం దారుణమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారపల్లి రమణారావు అన్నారు. నిడమర్రు ప్రజా సంఘాల కార్యాలయంలో సీఐటీయూ మండల కమిటీ సమావేశం కానూరు రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నారపల్లి మాట్లాడుతూ చంద్రబాబు బడా పారిశ్రామిక వేత్తలకు లాభాలు కట్టబెట్టేలా కార్మికుల పని గంటలు పెంచారన్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 8 గంటల పని వేళలను పెంచడాన్ని ప్రభుత్వం పునరాలోచించుకోవాలని డిమాండ్ చేశారు. కంచం వరప్రసాద్, గవర సత్యనారాయణ తదితురులు పాల్గొన్నారు.

అందరూ విద్యావంతులు కావాలి

దెందులూరు: అందరూ విద్యావంతులు కావాలనేది అక్షరాంధ్ర ఉద్యమ లక్ష్యమని వెలుగు బెంగుళూరు ఏపీఎం సురేష్ అన్నారు. ఆదివారం ఏటీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం ద్వారా వెలుగు శాఖ కార్యాలయానికి వచ్చిన టెక్స్ట్ బుక్కులను తీసుకొని రాత్రుళ్లు నిర్వహించే క్లాసులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్న 246 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నామన్నారు.

గురజాడ సేవలు ఆదర్శనీయం

దెందులూరు: తెలుగు భాషా వ్యాప్తికి బాల్య వివాహాలు, కన్యా శుల్కం వంటి సాంఘిక దురాచారాలను రూపు మాపడానికి సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు సేవలు ఆదర్శనీయమని డీఆర్డీ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. ఆదివారం నర్సింగ్ కళాశాలలో గురజాడ అప్పారావు జయంతిని నిర్వహించారు. సీనియర్ నర్సింగ్ విద్యార్థిని యామిని ఆయన జీవిత విశేషాలను వివరించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోతునూరు గ్రంథాలయంలో గురజాడ అప్పారావు జయంతిని గ్రంథాలయ అధికారి రాంబాబు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ రీడర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్వహణ లోపం.. రహదారికి శాపం



మండలపర్రు- నిడమర్రు మలుపులో ప్రమాదకరంగా ఉన్న రహదారి



మండలపర్రు వద్ద ప్రమాదకరంగా ఉన్న నీటితో నిండిన గుంత



బువ్వనపల్లి-మండలపర్రు వంతెన అప్రోచ్ రోడ్డు దుస్థితి

- సీసీ-బీటీ అప్రోచ్ల వద్ద ప్రమాదకరంగా గుంతలు
- గత ప్రభుత్వంలో రూ.6 కోట్లతో రహదారి నిర్మాణం
- కూటమి ప్రభుత్వంలో ప్రమాదాలతో స్థానికుల ఇక్కట్లు

నిడమర్రు: మండలంలో ఏళ్ల తరబడి అధ్వాన్నంగా ఉన్న రహదారులకు గత వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో మోక్షం కలిగింది. కానీ కూటమి ప్రభుత్వం ఆ రహదారుల నిర్వహణ గాలికి వదిలేయడంతో గత ప్రభుత్వంలో నిర్మించిన ఆర్అండ్బీ రహదారులన్నీ రోజు రోజుకూ అధ్వానంగా మారుతూ ప్రయాణికుల పాలిట శాపంగా మారుతున్నాయి. గణపవరం మండలం సరిపల్లి నుంచి ఉంగుటూరు మండలం నారాయణపురం వరకూ గత ప్రభుత్వంలో నిర్మించిన ఆర్అండ్బీ రహదారి నిర్వహణలోపంతో రోజు రోజుకు ప్రమాదకరంగా మారుతోంది. భీమవరం నుంచి మొదలు నారాయణపురం వరకూ ఉన్న ప్రయాణికులు ఏలూరు వెళ్లాలంటే ఇదే మార్గం. దీంతో ప్రతీ రోజు వేలాది వాహనాలు ఈ గణపవరం- ఏలూరు రోడ్డుపైనే వెళుతున్నాయి. ఈ రోడ్డు నిర్వహణ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉండటంతో ఎక్కడిక్కడ పెద్ద పెద్ద గుంతలతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

ప్రమాదకరంగా బీటీ-సీసీ అప్రోచ్లు

గణపవరం నుంచి మండల కేంద్రం నిడమర్రు వరకూ పలు చోట్లు సీసీ రోడ్డులు నిర్మించారు. అయితే ఈ సీసీ రహదారికి, తారు రోడ్డుకు మధ్య ఉన్న అప్రోచ్లు వద్ద ఉన్న రోడ్డు కుంగిపోయి పెద్ద పెద్ద గోతులగా మారుతున్నాయి. దీంతో సీసీ రహదారిపైకి ఎక్కాలన్నా, దిగాలన్నా అటు కార్లు, ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఈ అప్రోచ్ల వద్ద ద్విచక్రవాహనదారులు పడిపోయి కాళ్లు చేతులు విరగొట్టుకున్న సంఘటనలు జరిగినట్లు స్థానిక ప్రజలు చెపుతున్నారు. పలు చోట్ల గోతులు ఉన్నాయని హెచ్చరిస్తూ స్థానికులే ఆయా గోతుల్లో జెండాలు, బకెట్లు ఉంచి వాహనదారులను హెచ్చరిస్తున్నారు.

గత ప్రభుత్వంలో రూ.6 కోట్లతో నిర్మాణం

దశాబ్ద కాలంగా ఏలూరు వెళ్లాలన్నా, మండల కేంద్రం నిడమర్రు వెళ్లాలన్నా గ్రామస్తులు ఈ రహదారిపై అనేక ఇబ్బందులు పడేవారు. దీంతో రూ.6 కోట్లతో గత ప్రభుత్వంలో ఈ రహదారిని నిర్మాణం పూర్తి చేశారు. గణపవరం నుంచి నిడమర్రు వరకూ 8 కిలోమీటర్లు మార్గంలో గతంలో అధ్వానంగా ఉన్న చోట్ల సీసీ రోడ్డు నిర్మాణం చేశారు. గణపవరం మహాలక్ష్మీ కూడలి, బువ్వనపల్లి వెలంపేట, మండలపర్రు పెట్రోల్ బంక్, నిడమర్రులో 2 చోట్ల సీసీ రోడ్డును వేసారు. మార్చి 2024తో ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. కానీ నేటి వరకూ నిర్వహణ విషయంలో అధికారులు నిర్లక్ష్యం కారణంగా గుత్తేదారునితో కనీస మరమ్మతులు చేయించకపోవడంతో ఈ మార్గం గోతులు, గొప్పులుగా మారుతోంది. ఇకనైనా అధికారులు స్పందించి 5 శాతం నిర్వహణ నిధులతో రోడ్డు మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. అధికారులు ఇకనైనా స్పందించాలి.

కనీస నిర్వహణ చేపట్టకపోవడం దారుణం



గత ప్రభుత్వంలో నిర్మించిన ఈ రోడ్డు విషయంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోజు రోజుకు ప్రమాదకరంగా మారుతోంది. ఈ ప్రభుత్వంలో కనీసం రోడ్డు నిర్వహణలో పనులు చేయించకపోవడం దారుణం. బీటీ- సీసీ అప్రోచ్లు వద్ద దరుచూ ద్విచక్రవాహనదారులు పడిపోతున్నారు. తక్షణం మారామత్తులు చేపట్టి ప్రజల ప్రాణాలు కాపాడాలి.

– దూసనపూడి సత్యనారాయణ, ఎంపీటీసీ, నిడమర్రు-2

వర్షాలు తగ్గిన వెంటనే ప్రారంభిస్తాం

ఈ రోడ్డు సమస్య ఉన్నత అధికారుల దృష్టిలో ఉంచాము. వర్షాలు తగ్గిన వెంటనే రోడ్డు కాంట్రాక్టర్తో మరామత్తులు చేపట్టి గోతులు పూడ్చేలా చర్యలు తీసుకుంటాము. బీటీ-సీసీ అప్రోచ్ల వద్ద రోడ్డు కుంగిపోయి పడిన గోతులను పూర్తి స్థాయిలో శాశ్వత మరమ్మతులు చేపడతాం.

– జి. భాస్కరరావు, ఏఈ, ఆర్అండ్బీ

నీటి ప్రవాహానికి అడ్డంకిగా గుర్రపుడెక్క



గుండుగొలను వద్ద పేరుకుపోతున్న గుర్రపు డెక్క

భీమడోలు: గోదావరి కాలువలో గుర్రపు డెక్క పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. సార్వా సీజన్లో శివారు ప్రాంతాలకు సాగునీరు చేరడం లేదు. దీంతో వర్షాల కోసం రైతులు ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. వాస్తవానికి ఈ వేసవిలో కాలువలు మూసిన తరువాత గుండుగొలను సెక్షన్ పరిధిలో భీమడోలు మండలంలోని పూళ్ల శివారు వరకు కాలువ పూడిక తీశారు. దీని వలన సార్వా, దాళ్వా సీజన్లలో గుర్రపుడెక్క, తూడు, కర్రనాచుల బెడద ఉండదని సంబంధిత ఇరిగేషన్ అధికారులు నిర్వహణ గ్రాంటు కింద లక్షలాది రూపాయలతో పనులు చేశారు. అయితే గుండుగొలను సెక్షన్కు ఎగువన ఉన్న తాడేపల్లిగూడెం సెక్షన్ పరిధిలోని పూడిక తీత పనులు చేపట్టలేదు. దీంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతంలో గుర్రపు డెక్క, తూడు కిందకు కొట్టుకొస్తుంది. వాటితో పాటు విష సర్పాలు, ఇతర జంతు కళేబరాలు కొట్టుకురావడంతో కాలువ కాలుష్య కోరల్లో చిక్కుంది. దీనితో ఈ నీటినే తాగే కాల్వను ఆనుకున్నా గ్రామాల ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గుండుగొలను సెక్షన్ పరిధిలో వేసవిలో చేపట్టిన పనులు ఎవరికి ప్రయోజనమో అర్థం కావడం లేదని రైతులు వాపోతున్నారు. అయితే అధికారులు మాత్రం వాటిని తొలగిస్తున్నామని చెబుతున్నారు.

దళితులకు ప్రత్యేక శ్మశానాలు కేటాయించాలి



కత్తుల రవి

దెందులూరు: ఏలూరు జిల్లాలో దళితులకు ప్రత్యేక శ్మశానాలు ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధికార ప్రతినిధి కత్తుల రవి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంస్కృతి సంప్రదాయాలను గౌరవించాలన్నారు. మరణానంతరం ఏ వ్యక్తికైనా జరగాల్సిన అంతిమ కార్యక్రమం కనీస మర్యాదలతో జరగటానికి శ్మశాన సౌకర్యం అవసరమన్నారు. పెదపాడు మండలంలో తోట గూడెం, దాసరిగూడెం గ్రామాల్లో దళితులకు శ్మశాన స్థలం లేదన్నారు. రాజుపేట గ్రామంలో శ్మశానం ఉన్నప్పటికీ దారి సౌకర్యం లేకపోవడం గమనార్హమన్నారు. ఏలూరు జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న కోమటి లంకలో ఇటీవల ఒక వ్యక్తి చనిపోతే ఉధృతంగా వస్తున్న ప్రవాహంలో రేకు పడవలో మృతదేహాన్ని తీసుకెళ్లిన సంగతి హృదయ విధారకమన్నారు. జిల్లా వ్యాప్తంగా శ్మశానాలు లేని చోట స్థలం కేటాయించి స్థలమున్న చోట సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కత్తుల రవి కోరారు.

అధ్వాన రోడ్డుతో తప్పని తిప్పలు



అధ్వానంగా ఉన్న రహదారి

భీమడోలు: రాష్ట్రీయ రహదారి భీమడోలు జంక్షన్ నుంచి సంతమార్కెట్ వరకు గల రోడ్డు అధ్వానంగా మారింది. భీమడోలు స్టేట్ బ్యాంకు సమీపంలోని ఓ ఆసుపత్రి వద్ద గల రోడ్డుపై భారీ గుంతల నేపథ్యంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలువురు గాయాలపాలవుతున్నారని పలుమార్లు సాక్షిలో పలు కథనాలు ప్రచురించారు. సంబంధిత అర్అండ్బీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అయితే భీమడోలులో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఆ గుంతల్లో వర్షం నీరు భారీగా చేరింది. అదే సమయంలో భీమడోలు రైల్వే గేటు నుంచి జంక్షన్కు పండ్ల లోడుతో వస్తున్న ఆటో డ్రైవర్ అంచనా వేయకపోవడంతో ఆటో గుంతలో పడి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్కు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో ఆటోలో పండ్లన్నీ రోడ్డుపై పడి దెబ్బతిన్నాయి. ఆటో పాక్షికంగా దెబ్బతినడంతో నష్టం వాటిల్లింది. ఈ రోడ్డుపై ఏర్పడిన గుంతలతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. ఇది ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రానికి వెళ్లే ప్రధాన రహదారి అవడంతో భక్తులు, ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు.

కార్మికులకు సమగ్ర చట్టం అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా అధ్యక్షుడు

కొయ్యలగూడెం: అసంఘటిత రంగంలో పని చేస్తున్న ముఠా, హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం కోసం ఏఐటీయూసీ సుదీర్ఘకాలంగా పోరాడుతుందని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే, సీపీఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం కొయ్యలగూడెం మార్కెట్ యార్డులో ఐరన్, సిమెంట్ షాపుల్లో పని చేస్తున్న ముఠా కార్మికుల సమావేశం తాడిగడప ఆంజనేయరాజు అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం ముఠా కార్మికుల సంఘ సభ్యులను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా తాడిగడప ఆంజనేయరాజు, అధ్యక్షుడిగా వెలగల వెంకటేశ్వరరావు, ఉపాధ్యాక్షుడిగా బొబ్బర చిట్టిబాబు, కార్యదర్శిగా పులపాకుల దుర్గారావు, సహాయ కార్యదర్శిగా డొరా వరప్రసాద్, కోశాధికారిగా సంపతరావు, సభ్యులుగా కోరుకొల్లు నాగరాజు, అయినపర్తి రాజశేఖర్ ఎన్నికయ్యారు. సమావేశంలో డాంగే, వెంకటేశ్వరరావు, ఏఐటీయూసి నాయకులు లక్క లక్ష్మణరావు, గోలిమే బాల ఏసు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

కామవరపుకోట: వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన భీమిరెడ్డి వెంకన్నబాబు రామన్నపాలెం మండల పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ రాయింకుల సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకన్నబాబు మాట్లాడుతూ సామాన్య కార్యకర్తగా ఉన్న నాకు రాష్ట్ర స్థాయి పదవి ఇచ్చిన చింతలపూడి నియోజకవర్గం కన్వీనర్ కంభం విజయరాజుకు, ఏలూరు పార్లమెంట్ ఇన్చార్జి కారుమూరి సునీల్కు రుణపడి ఉంటానని, వైఎస్ జగన్మోహన్రెడ్డిని 2029లో ముఖ్యమంత్రి చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తాను అని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ గుర్రాల రవికుమార్, కామవరపుకోట టౌన్ ప్రెసిడెంట్ నానాది సాగర్ పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక అభిషేకాలు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గురవాయిగూడెంలో వేంచేసియున్న శ్రీహరిహరసుత అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఆదివారం స్వామి జన్మ నక్షత్రమైన ఉత్తరా నక్షత్రం సందర్భంగా మండపారాధన, పుణ్యాహవాచనం, మూల విరాట్కు రుద్రాభిషేకం, లక్ష్మి గణపతి హోమం నీరాజన మంత్రపుష్పాలు నిర్వహించారు. అనంతరం స్వాములకు, భవానీలకు, భక్తులకు మహాగణపతి పీఠం స్వాములు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సెక్రెటరీ గంగు జగన్మోహన్ రెడ్డి, కోశాధికారి కోనా పార్వతి (గురు స్వామి), గుంట్ల వెంకటేశ్వరరావు, నెక్కలపూడి సూర్యచంద్రరావు, బాకీ శ్రీనివాస్రెడ్డి, భక్తులు పాల్గొన్నారు. దసరా మహోత్సవాల సందర్భంగా జంగారెడ్డిగూడేనికి చెందిన మద్దుల సుబ్రహ్మణ్యం దంపతులు, అమ్మవారికి పట్టు వస్త్రాలు అందజేశారు.

నేటి నుంచి దసరా శరన్నవరాత్రి

ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీలు



నిడమర్రు: విద్యుత్ కాంతులతో మండలపర్రు ఉమాదేవి ఆలయం

భీమడోలు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ఈ నెల 22వ తేదీ సోమవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు 11 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు వాడవాడలా ఉత్సవ కమిటీలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, అంబర్పేట, పోలసానిపల్లి, నరెడ్లగూడెం గ్రామాల్లోని శివాలయాల్లో ఈ ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు. దీంతో ఆలయాలు ఉత్సవ శోభను సంతరించుకున్నాయి. గుండుగొలనులో వేంచేసియున్న శ్రీభ్రమరాంబికా మల్లేశ్వరస్వామి, భీమడోలు గోదావరి కాలువ గట్టుపై వెలసిన కనకదుర్గాదేవి ఆలయాల్లో అమ్మవారిని అలంకరిస్తున్నారు. గుండుగొలనులో అమ్మవారు తొలి రోజు శ్రీభ్రమరాంబ దేవి, వెండి చీర అలంకరణ, 23వ తేదీన మంగళవారం బాలాత్రిపురసుందరి దేవిగా, 24వ తేదీ బుధవారం శ్రీమహాచండీ దేవిగా, 25వ తేదీ గురువారం అన్నపూర్ణాదేవిగా, 26వ తేదీ శుక్రవారం ధనలక్ష్మీదేవిగా, 27వ తేదీ శనివారం వారాహిదేవిగా, 28వ తేదీ ఆదివారం గాయత్రిదేవిగా, 29వ తేదీ సోమవారం సరస్వతీదేవిగా, 30వ తేదీ మంగళవారం దుర్గాదేవిగా, అక్టోబర్ ఒకటి బుధవారం కాళీకాదేవిగా, 2వ తేదీన గురువారం దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిస్తారని ఆలయ పూజారి లంకా శ్రీనివాస్ శర్మ తెలిపారు.



భీమడోలు: దసరా ఉత్సవాలకు సిద్ధం చేసిన అమ్మవారి విగ్రహాలు

మట్టి విగ్రహాల తయారీలో బుల్లియ్య దిట్ట

పూళ్ల శివారు కోడూరుపాడు గ్రామంలోని విగ్రహాల కళాకారుడు యర్రవరపు బుల్లియ్య పర్యావరణ హితం కోసం మట్టితో అమ్మవారిని తయారు చేయడంతో దిట్ట. పర్యావరణహితంగా ఉండే బంకమట్టి, సిమెంట్, సున్నంతో తయారు చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆరు నెలల నుంచి ఈ విగ్రహాలను తన కుటుంబంతోపాటు పలువురికి ఉపాధిని కల్పిస్తున్నారు. భీమడోలు, ఉంగుటూరు మండలాల్లోపాటు జిల్లావ్యాప్తంగా పలు గ్రామాలకు అమ్మవారి విగ్రహాలను తరలిస్తున్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

నిడమర్రు: గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. సోమవారం నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకూ పది రోజుల పాటు దుర్గాదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలపర్రు ఉమాదేవి, బువ్వనపల్లి చక్రధర మాత, నిడమర్రు, పత్తేపురం తదితర గ్రామాల్లో దుర్గాదేవి విగ్రహాలను నెలకొల్పడానికి వేదికల వద్ద చేస్తున్న ఏర్పాట్లు విద్యుత్ అలంకరణలతో ఆకట్టుకుంటున్నాయి.

గిరిపుత్రులు మెచ్చిన ఆహారం

- గిరిజనుల ఆహారంలో భాగం పుట్టగొడుగులు
- నాటు పుట్టగొడుగులకు పెరిగిన డిమాండ్



అటవీ ప్రాంతంలో లభించిన నాటు పుట్టగొడుగులు

బుట్టాయగూడెం: వర్షాకాలం ప్రారంభం కాగానే అటవీ ప్రాంతంలో పుట్ట గొడుగులు పెరుగుతూ ఉంటాయి. వీటిని గిరిజనులు ఎక్కువగా ఇష్టపడతారు. అటవీ ప్రాంతంలో పెరిగే పుట్టగొడుగులు గిరిపుత్రుల ఆహారంలో భాగమవుతున్నాయి. అయితే ఈ ఏడాది వర్షాలు అంతంతమాత్రంగానే కురిశాయి. అయితే గత వారం రోజుల క్రితం నుంచి కురుస్తున్న వర్షాలతో పశ్చిమ మన్యంలోని అటవీ ప్రాంతంలో పుట్టల్లో నాటు పుట్టగొడుగులు అత్యధికంగా లభిస్తున్నాయి. వర్షాలతో పడడంతో పుట్టలపై పుట్టగొడుగులు కనిపిస్తున్నాయి. దీంతో అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉన్న గిరిజనులు నాటు పుట్టగొడుగులను తీసుకొచ్చి విక్రయిస్తున్నారు.

కట్ట రూ.100 చొప్పున విక్రయం

అటవీ ప్రాంతంలో లభించే పుట్టగొడుగులను 25 నుంచి 30 వరకు ఒక కట్టగా కట్టి సుమారు రూ.100కు గిరిజనులు విక్రయిస్తున్నారు. అడవిలో లభించే నాటు పుట్టగొడుగులకు అధిక డిమాండ్ ఉంది. పుట్టగొడుగులు అడవి నుంచి తీసుకువచ్చి వెంటనే అమ్ముడుపోతున్నాయి. అయితే పుట్టగొడుగుల సేకరణ అంత సులభం కాదు. తెల్లవారు జామున అటవీ ప్రాంతానికి వెళ్లి పుట్టలపై ఉన్న పుట్టగొడుగులను సేకరించాలి. ఒక్కోసారి ఆ పుట్టల్లో పాములు కూడా ఉంటాయి. అలాగే చీమలు కూడా కుడతాయి. పుట్టగొడుగులకు వెళ్లిన గిరిజనులు విషపురుగుల బారిన పడిన సంఘటనలూ ఉన్నాయి. అయితే ప్రతి ఏటా వర్షాకాల సీజన్లో ఈ ప్రాంతానికి వచ్చి పుట్టగొడుగులను తీసుకెళ్లిన వారు ఉన్నారు. ఈ ఏడాది కూడా వర్షాలకు పుట్టగొడుగులు లభించడంతో వాటి కోసం అనేక మంది ఏజెన్సీకి క్యూ కడుతున్నారు. కొంతమంది వీటిని గిరిజన ప్రాంతంలో రూ.100కు కొనుగోలు చేసి, బయటి ప్రాంతాల్లో రూ.300 నుంచి రూ.400 వరకూ విక్రయిస్తున్నారు. ప్రకృతి సిద్ధంగా లభించే ఈ పుట్టగొడుగులు ఎంతో రుచిగా ఉండటమే కాకుండా ఆరోగ్యవంతమని గిరిజనులు చెబుతున్నారు.

చిన్నప్పటి నుంచి తింటున్నాను



నేను చిన్నప్పటి నుంచి మా అడవిలో లభించే పుట్ట గొడుగులను తింటున్నాను. ఏది తినాలి, ఏది తినకూడదు అనే విషయాన్ని మా పెద్దల ద్వారా తెలుసుకుని మరీ తింటున్నాను. వర్షకాలం వచ్చిందంటే మా గ్రామంలో అందరూ అడవికి వెళ్లి సేకరిస్తారు. అధికంగా లభిస్తే బయట వ్యక్తులకు విక్రయిస్తాం.

-కోర్స గంగరాజు, కామవరం, బుట్టాయగూడెం మండలం

అటవీ ప్రాంతంలో అధికంగా లభిస్తాయి



మా గ్రామ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో నాటు పుట్టగొడుగులు అధికంగా లభిస్తాయి. ప్రతి ఏటా వర్షాలు కురిసే సమయంలో ఈ పుట్టగొడుగులు మొలుస్తాయి. వాటిని సేకరించి తింటాం. ఇవి ఆరోగ్యానికి ఎంతో మంచిది.

కోర్స రాంబాబు, కామవరం, బుట్టాయగూడెం మండలం

ఈ-శ్రమ్ పోర్టల్లో నమోదు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక శాఖ ఏసీఎల్ నాగేశ్వరరావు

ఏలూరు (టూటౌన్): కార్మికులందరూ తక్షణమే ఈ-శ్రమ్ పోర్టల్లో నమోదు చేసుకోవాలని కార్మిక శాఖ సహాయ సంచాలకులు నాగేశ్వరరావు కోరారు. స్థానిక ఇఫ్టూ జిల్లా కార్యాలయంలో పెయింటింగ్ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో కన్వీనర్ లొట్ల సత్యనారాయణ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ (ఏసీఎల్) నాగేశ్వరరావు మాట్లాడుతూ పెయింటింగ్ కార్మికులందరూ లేబర్ ఆఫీసులో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఇఫ్టూ ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు ప్రముఖ న్యాయవాది కేవీ రత్నం మాట్లాడుతూ సంక్షేమ బోర్డులో వందల కోట్ల రూపాయలు ఉన్నాయని అవి కార్మికులకు సంబంధించిన కుటుంబాల అవసరాలకే వాడాలని కోరారు. ఈ జనరల్ బాడీ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏలూరు ఏరియా పెయింటింగ్ కార్మిక సంఘాన్ని ఇఫ్టూకి అనుబంధం చేయాలని ఏలూరు పెయింటింగ్ కార్మికులు తీర్మానం చేశారు. ఏపీ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం నగర అధ్యక్ష కార్యదర్శులు నవుడు నెహ్రూ బాబు, కాకర్ల శ్రీను, ఎలక్ట్రికల్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు లింగమల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.